# జాతీయ సాగర సమాచార సేవా కేంద్రంతో ఎయు ఎంఒయు

ఎయు క్యాంపస్,
మార్చి 26, ప్రభాతవార్త

భూగర్భ సాగరశాస్త్రాల్లో పరిశోధన, శిక్షణ వంటి కార్యక్రమాలను సంయుక్తంగా చేపట్టేందుకు హైదరాబాద్‌లోని జాతీయ సాగర సమాచార సేవా కేంద్రంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం సమన్వయ అవగాహనా ఒప్పందం (ఎంఒయు)ను కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం ఎయు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ ఒప్పంద పత్రాలపై విసి ప్రొఫెసర్ ఎల్.వేణుగోపాలరెడ్డి గ్రేటర్ విశాఖ నగర మేయర్ పులుసు జనార్ధనరావు సమక్షంలో ఎయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.విజయప్రకాష్, ఇంకోయిస్ డైరెక్టర్ డాక్టర్ శైలేష్ నాయక్‌లు సంతకాలు చేశారు. దీనివల్ల ప్రజలకు శాస్త్ర సాంకేతిక విషయాలలో అవగాహన కల్పించి వారికి లాభాలను చేకూర్చేందుకు వీలవుతుంది. ఇంకోయిస్ సంస్థకు సాగర సమాచార వ్యవస్థలకు సంబంధించి అపార అనుభవం వుంది. తీర ప్రాంత వనరుల గురించి, సునామీ, తుపాను, వంటి ప్రకృతి వైపరీత్యాల ముందస్తు హెచ్చరికలను గురించి ఈ సంస్థ వద్ద అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వుంది. కారణాలేవైనా దశాబ్ద కాలంలో చేపల వేట అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. అలాంటి సందర్భంలో ఈ ఒప్పందం మత్స్యకారుల వనరులు అన్వేషణలో ఎంతో సహాయపడగలదు. దీనిలో భాగంగా విశాఖపట్నం, మచిలీపట్నంలో వినియోగదారుల సదస్సులను నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే కొన్ని జరిగాయి. సుమారు 200పైగా మత్స్యకారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సముద్రం లోతు, చేపల ఉనికి, వాతావరణ పరిస్థితి వంటి విషయాల గురించి విలువైన సమాచారం ఈసదస్సులో అందించారు. మత్స్యకారుల కోసం ఎయు బంగాళాఖాత అధ్యయన కేంద్రం ఇప్పటికే సాగర తీర సముద్ర శాస్త్రాల శాటిలైట్ అన్వేషణపై మంచి సమాచారాన్ని సేకరించింది. ఈసందర్భంగా నగర మేయరు పులుసు జనార్ధనరావు మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చే ఇలాంటి ప్రాజెక్టును చేపట్టిన ఎయు, ఇంకోయిస్ సంస్థలను అభినందించారు.